సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 26 । మే । 2023



జాతీయ జట్టుకు ఎంపిక

జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టుకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

- 8లో ▸



ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయకపోవడంతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.2 /30.4

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఖలీల్‌వాడి : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న పలువురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. 1996, 1998 బ్యాచ్‌కు చెందిన 28 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరిలో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 20 మంది, కామారెడ్డి జిల్లాకు చెందిన 8 మంది ఉన్నారు. బాసర జోన్‌తో ఆదిలాబాద్‌కు చెందిన పోలీస్‌కానిస్టేబుళ్లకే పదోన్నతులు లభించాయని, జిల్లాలోని పో లీసులు నష్టపోయినట్లు కానిస్టేబుళ్లు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లాకు చెందిన వారికి పదోన్నతి లభించింది.

జూన్ 7, 8 తేదీల్లో 'ధాత్రి' ప్లాట్ల వేలం

సుభాష్‌నగర్ : నగర శివారులోని మల్లారం వద్ద గల ధాత్రి టౌన్‌షిప్‌లో మూడో విడత ప్లాట్లు వేలం జూన్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో 147 ప్లాట్ల విక్రయానికి సంబంధించి అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాత్రి టౌన్‌షిప్‌లో ప్లాటు గజం కనీస ధర రూ.ఆరు వేలుగా నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే రోడ్లు పూర్తయ్యాయని, విద్యుత్, నీటి సరఫరా, డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి నిధులు విడుదల చేశామన్నారు. వారం రోజుల్లో టెండర్ పూర్తయి పనులు ప్రారంభమౌతాయన్నారు. జూన్ 7, 8 తే దీల్లో జరిగే బహిరంగ వేలంలో ప్రజలు పా ల్గొని లే అవుట్ ప్లాట్లను దక్కించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి టీ హబ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. బయో కెమిస్ట్ పోస్టు 1, రేడియాల జిస్ట్ 1, ల్యాబ్ మేనేజర్ 1, రేడియోగ్రాఫర్ 1 (పురుష) పోస్టులకు విద్యార్హత గల అభ్యర్థు లు ఈ నెలా 26 నుంచి వచ్చేనెలా జూన్ 3 వ రకు ఆస్పత్రిలోని రూం నంబర్ 43లో దర ఖాస్తులు అందజేయాలని సూచించారు. ద రఖాస్తు ఫారం వెబ్‌సైట్ www. nizama bad. telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, రూ.500 డీడీ ఇన్ ఫేవర్ ఆఫ్ 'కన్వీనర్ జీజీహెచ్ నిజామాబాద్' పే రు మీద చెల్లించి ఆస్పత్రిలో అందజేయాల ని కోరారు.

పద్మ అవార్డుల కోసం..

నిజామాబాద్‌నాగారం : గణతంత్ర దినోత్సవం 2024 సందర్భంగా సామాజిక సేవా, క్రీడ, సాహిత్య రంగాల్లో విశిష్ట సేవలందించిన అభ్యర్థుల నుంచి పద్మ అవార్డు కోసం సిఫార్సు చేయుటకు దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన డాక్యుమెంట్లను సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ నాలుగు సెట్లు, నామినేషన్ ఫారం, 800 పదాలకు మించకుండా అభ్యర్థి చేసిన కార్యక్రమాల గురించి వివరిస్తు రాసి మే 29 లోపు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం (స్టెప్), సుభాష్‌నగర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు www. padmaawards.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

గురుకుల ఉపాధ్యాయ పరీక్షల శిక్షణకు..

నిజామాబాద్‌అర్బన్ : గురుకుల ఉపాధ్యాయుల పరీక్ష కోసం బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ నెల 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వార్షిక ఆదాయం రూ.ఐదు లక్షల లోపు ఉండి, డిగ్రీ, బీఈడీ పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. www. tsbcstudycircle. cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటివద్దకే తపాలా సేవలు

నిజామాబాద్ సిటీ : మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీలకు పోస్టల్‌శాఖ తీపి కబురు చెప్పింది. కూలీలు పనిచేసే చోట, ఇంటివద్ద వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించిన వివరాలను పోస్టల్ శాఖ నిజామాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఉమా మహేశ్వర్ గురువారం తెలిపారు. కూలీలకు బ్యాంక్ ఖాతాలు లేకపోవటంతో వేతనాలు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డివిజన్‌లో 482 పోస్టాఫీసులు ఉన్నాయని, కూలీలకు ఉపయోగపడే సేవింగ్, ఐపీపీబీ ఖాతాలు తెరుచుటకు అన్నిట్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఖాతాలు తీసుకుంటే ఇంటివద్ద, పనిచేసే చోటనే వేతనాలు తీసుకోవచ్చని, ఈ సౌకర్యాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

ఏకవాక్య తీర్మానం..

- తెయూ వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్ణయం
- కొత్త సచివాలయంలో వర్సిటీ 59వ పాలకమండలి సమావేశం
- 55, 56, 57, 58 ఈసీ సమావేశాల తీర్మానాలపై సమీక్ష
- జూన్ 3న 60వ సమావేశం
- రిజిస్ట్రార్‌గా యాదగిరి కొనసాగింపు..
- ముగ్గురి పేర్లను ఈసీ సభ్యులకు ప్రతిపాదించిన వీసీ

అక్రమాలు, అవకతవకల అభియోగాల నేపథ్యంలో తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాలకమండలి ఏకవాక్య తీర్మానం చేసింది. కొత్త సచివాలయంలో తెయూ 59వ ఈసీ సమావేశం జరిగింది. ఈసీ సమీక్షలో ముగ్గురు రిజిస్ట్రార్ల నుంచి దుర్వినియోగమైన నిధుల రికవరీ, విద్యావర్ధిని సస్పెన్షన్, సర్వీసు పుస్తకాల టాంపరింగ్ అలాగే కనకయ్యపై పెట్టాల్సిన క్రిమినల్ కేసులు, బడ్జెట్, ఐదుగురు సభ్యుల బృందం చేయాల్సిన దర్యాప్తు తదితర అంశాలు ఉన్నాయి.



ఈసీ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పాలకమండలి ఏకవాక్య తీర్మానం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని కొత్త సచివాలయంలో తెయూ 59వ పాలకమండలి సమావేశం జరిగింది. వీసీ హాజరు కాకపోవడంతో సమావేశానికి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహరించారు. గత నెల 19, 26, ఈ నెల 5, 12వ తేదీల్లో వరుసగా నిర్వహించిన 55, 56, 57, 58 సమావేశాల్లో చేసిన తీర్మానాల విషయమై సమావేశంలో సమీక్షించారు. 60వ సమావేశాన్ని జూన్ 3న నిర్వహించాలని, అదే విధంగా వర్సిటీకి రిజిస్ట్రార్‌గా యాదగిరిని కొనసాగించాలని నిర్ణయించారు. అయితే ఈ నెల 15న వర్సిటీలోని రిజిస్ట్రార్ గదికి తాళం తీయించకుండా చేయడంతో అప్పటి నుంచి రిజిస్ట్రార్ యాదగిరి ఆ చాంబర్‌కు రావడం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి యాదగిరి కొనసాగింపు గురించి ప్రస్తావించారు. అయితే సమావేశానికి యాదగిరి హాజరు కాలేదు. ఇదిలా ఉండగా వీసీ వ్యవహారాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. తగిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం.

పాలక మండలి సమావేశంలో సమీక్షించిన అంశాల్లో వీసీ అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు కేసులు, ముగ్గురు రిజిస్ట్రార్ల నుంచి దుర్వినియోగమైన నిధుల రికవరీ, విద్యావర్ధిని సస్పెన్షన్, సర్వీసు పుస్తకాల టాంపరింగ్ అలాగే కనకయ్యపై పెట్టాల్సిన క్రిమినల్ కేసులు, బడ్జెట్, ఐదుగురు సభ్యుల బృందం చేయాల్సిన దర్యాప్తు తదితర అంశాలు ఉన్నాయి. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, పాలకమండలి సభ్యులు వసుంధరాదేవి, గంగాధర్‌గౌడ్, మారయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నసీమ్ పాల్గొన్నారు.

వైస్ చాన్స్‌లర్ సన్నిహితుల పేర్లు..

తాజా పాలకవర్గ సమావేశం నేపథ్యంలో బుధవారం సాయంత్రం వీసీ రవీందర్, రిజిస్ట్రార్‌గా యాదగిరికి బదులు మరో ముగ్గురి పేర్లను వాట్సాప్ ద్వారా ఈసీ సభ్యులకు ప్రతిపాదించడం విశేషం. ఇందులో చంద్రశేఖర్, రాంబాబు, గతంలో పాలకమండలి తొలగించిన కనకయ్య పేర్లు ఉన్నాయి. వీళ్లలో కనకయ్యను అవినీతి, అక్రమాల నేపథ్యంలో గతంలోనే ఈసీ తొలగించింది. కనకయ్యను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇక రాంబాబు కూడా కనకయ్యలాగే వీసీకి అత్యంత సన్నిహితుడు. ఇక చంద్రశేఖర్ విషయానికి వస్తే మాత్రం వీసీతో ఏమాత్రం పొసగని వ్యక్తి. చంద్రశేఖర్‌కు షోకాజ్ నోటీసులు ఇస్తానని వీసీ ఇప్పటికే రెండుసార్లు ప్రకటించారు.

అలాగే చంద్రశేఖర్ సర్‌నేమ్ తేడా ఉందంటూ ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను వీసీ మీడియాకు ప్రకటించడంతో పాటు పీఆర్ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయించడం గమనార్హం. అయితే ఈసీ సభ్యులకు, చంద్రశేఖర్‌కు మధ్య వైరం సృష్టించేందుకే వీసీ తనకు సన్నిహితులైన ఇద్దరి పేర్లతో పాటు ఈ పేరును ప్రతిపాదించినట్లు వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా విషయాలపై ఈసీ సభ్యులు మాత్రం స్పందించలేదు.

ఎంసెట్‌లో జిల్లా విద్యార్థుల సత్తా



సిద్దార్థ, 409 ర్యాంక్



613 ర్యాంక్ సాధించిన సాయి అక్షయ్‌ను సన్మానిస్తున్న 'కాకతీయ' డైరెక్టర్ రామోజీరావు

నిజామాబాద్‌అర్బన్ : ఎంసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కాకతీయ కళాశాలకు చెందిన ఎ సిదార్థ 409 ర్యాంకు సాధించాడు. సాయిఅక్షయ్ 613 స్టేట్ ర్యాంకు సాధించాడు. 24 మంది కాకతీయ విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులు సాధించారు. ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులు ఏడుగురు నాలుగు వేల లోపు ర్యాంకులు సాధించారు. వెక్టర్ జూనియర్ కళాశాల విద్యార్థులు సిహెచ్ నిశితరెడ్డి 1404, వినయ్ 1670 ర్యాంకులు సాధించారు.

రాయితీ విత్తనాలు లేనట్లేనా?

- మక్క, సోయా విత్తనాలను వ్యాపారుల వద్దే కొనుగోలు చేస్తున్న రైతులు
- జీలుగ విత్తనాలను మాత్రమే సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ శాఖ



మోర్తాడ్ : రానున్న వర్షాకాలం సీజనుకు గాను మొక్కజొన్న, సోయా విత్తనాలను రాయితీపై అందించే అవకాశం కనిపించడం లేదు. గతంలో ప్రతి వర్షాకాలం సీజనులో రెండు, మూడు రకాల విత్తనాలను రాయితీపై సహకార సంఘాల ద్వారా విక్రయించేవారు. విత్తనాలకు సబ్సిడీని అందించి రైతులపై భారం తగ్గించడానికి ప్రభుత్వం విముఖత చూపడంతో రైతులు వ్యాపారుల వద్దనే విత్తనాలను ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కేవలం జీలుగ విత్తనాలను మాత్రమే రాయితీపై వ్యవసాయ శాఖ అందిస్తోంది. సోయా, మొక్కజొన్న విత్తనాల సంచులను 15 శాతం నుంచి 25 శాతం రాయితీపై రైతులకు విక్రయించేవారు. సహకార సంఘాలకు విత్తనాల నిలువలను పంపించి రైతుల వివరాలను నమోదు చేసుకుని రాయితీ విత్తనాలను విక్రయించడం ఎంతో కాలం కొనసాగింది. ప్రభుత్వం 2018 నుంచి రైతుబంధు అందిస్తుండటంతో రాయితీ పథకాలను అన్నింటిని నిలిపివేసిందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. వ్యాపారుల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాల్సి రావడంతో వారు చెప్పిన ధరకే విత్తనాలను రైతులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

> **జీలుగ విత్తనాలే ఉన్నాయి**
>
> రైతాంగానికి రానున్న వానాకాలం సీజన్‌కు రాయితీపై జీలుగ విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జీలుగ విత్తనాలను భూసారం కోసం వినియోగిస్తారు. మొక్కజొన్న, సోయా విత్తనాల సరఫరాపై మాకు ఎలాంటి సమాచారం లేదు.
>
> – అబ్దుల్ మాలిక్, వ్యవసాయాధికారి, ఏర్గట్ల

8 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా కేంద్రంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్'ను ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్టివల్‌ను పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో జూన్ 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో చేపల పులుసు, ఫిష్ కట్లెట్స్, ప్రాన్స్ పకోడి, ఇతర రకాలు కలిపి మొత్తం 20 రకాల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ వంటకాలపై ఇప్పటికే జిల్లాలోని 17 మంది మహిళలకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించామని, వీరు జిల్లా వాసులకు ప్రత్యేక చేపల వంటకాల రుచులను అందిస్తారన్నారు. మత్స్య శాఖ స్టాళ్లలో వెటర్నరీ, డెయిరీ డెవలప్‌మెంట్ స్టాళ్లను కూడా ప్రదర్శనకు ఉంచుతామన్నారు. చేపల, రొయ్యల వంటకాల్లో శిక్షణ పొందిన వారు, ఔత్సాహికులు స్టాళ్ల ఏర్పాటు, ఇతర వివరాలకు ఐదు రోజుల్లోగా జిల్లా మత్స్య శాఖ అధికారి కార్యాలయంలో (94406 18089) సంప్రదించాలని సూచించారు.

తెగని తొర్తి పంచాయితీ..

- రోజుకో ఫిర్యాదుతో పోలీసు స్టేషన్ గడప తొక్కుతున్న గ్రామస్తులు
- రెండు వర్గాలుగా చీలిపోయి ఏడాదిన్నర గడుస్తున్నా..
- సయోధ్య కుదర్చని అధికారులు



మోర్తాడ్ : ఏడాదిన్నర కింద రెండుగా చీలిపోయిన తొర్తి గ్రామస్తుల మధ్య సయోధ్య కుదర్చడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. గ్రామస్తులు అందరు ఐక్యంగా ఉండాలని మెజార్టీ ప్రజలు కోరుకుంటున్నా ఇరువర్గాలలోని కొందరు వ్యక్తుల మూలంగా శాంతి చర్చలు సఫలం కావడం లేదు. ఫలితంగా రోజు ఏదో ఒక సమస్యపై పోలీసు స్టేషన్ గడప తొక్కుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారు. తాజాగా తన ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తిని కట్టడి చేయడంతో ఇంటి బేరం రద్దు చేశారని ఒక వర్గంలోని వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రైతు సంఘం పెద్ద మనుషులను భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు పిలిపించారు. చివరకు ఫిర్యాదు చేసిన వ్యక్తి పోలీసుల ముందు హాజరు కాకపోవడంతో ఈ పంచాయితీ పెండింగ్‌లో పడి ఇది వరకు ఉన్న ఘర్షణ వాతావరణాన్ని వేడెక్కించింది. శాంతికి విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి ఆటకట్టిస్తేనే తొర్తి ప్రజలు అందరు కలిసిపోయి ఐక్యంగా ఉంటారనే వాదన బలంగా వినిపిస్తుంది. చర్చలు జరిపే సమయంలో వివాదస్పదమైన వ్యక్తులను దూరం పెట్టి శాంతిని కోరుకునే వారితోనే రాజీయత్నం సాగించాలని పలువురు సూచిస్తున్నారు. తొర్తి గ్రామస్తులు రెండుగా చీలిపోవడంతో చిన్న వ్యాపారులు సైతం తమ దందాలు సాగక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. అంతేకాక ఒక వర్గం వారితో మరో వర్గం వ్యక్తులు మాట్లాడితే పెద్ద మొత్తంలో జరిమానాలను వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి తొర్తి ప్రజలను ఐక్యం చేయడానికి చర్చలు జరిపించాలని పలువురు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇన్‌చార్జి సీపీ



సుభాష్‌నగర్ : హైదరాబాద్‌లోని సచివాల యంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అనంత రం సచివాలయం ఆవరణలో సీఎం కేసీఆర్, సీఎస్ శాంతకుమారి, డీజీపీ అంజనీ కుమా ర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో గ్రూప్ ఫొటో దిగారు.

వన్యప్రాణికి ప్రాణహాని

- గోదావరి తీరంలో వేటాడుతున్న కుక్కలు
- వలస పక్షులపై గుంపుగా దాడి
- భయంతో వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్న జింకలు
- ఒకే ఫారెస్టు అధికారితో సాధ్యం కాని పర్యవేక్షణ



గోదావరి పరీవాహక ప్రాంతంలో వలస పక్షులను వేటాడేందుకు యత్నిస్తున్న శునకం



కుక్కల దాడిలో మృతి చెందిన జింక (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సంచరించే వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. కుక్కలు వెంటాడి వేటాడుతున్నాయి. మందలుగా ఏర్పడి జింకలు, వలస పక్షులపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. భయంతో జింకలు వేరే ప్రాంతాలకు, మరింత లోపలికి వెళ్లిపోతున్నాయి. దీంతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో వన్య ప్రాణుల సందడి తగ్గిపోయింది. వందల సంఖ్యలో ఉండే జింకలు పదుల సంఖ్యలోనే కనిపిస్తున్నాయి. గతంలో రెండు, మూడు జింకలు కుక్కలకు బలైన విషయం తెలిసిందే. అప్పట్నుంచి ఫారెస్టు శాఖ ఇటువైపు నిఘాను పెంచింది. గాదెపల్లి, చిన్నయానం, నడ్కుడ, అన్నారం, గంగాసముందర్ గ్రామస్తులు, రైతుల సహాయంతో కుక్కలను కట్టడి చేశారు. దీంతో వన్య ప్రాణులు హాయిగా విహరించాయి. కానీ, గోదావరి తీరంతో మళ్లీ కుక్కలు సంచరిస్తున్నాయి. ఆహారం కోసం వన్య ప్రాణులను వేటాడేందుకు ప్రయత్నిస్తున్నాయి. వలస వచ్చే పక్షులపై కూడా దాడి చేస్తున్నాయి. దీంతో కొంగలు, ఇతర జాతి పక్షులు స్వేచ్ఛగా తిరగలేకపోతున్నాయి. పచ్చిక బయళ్లలో వన్యప్రాణుల సందడి పెద్దగా కనిపించడం లేదు.

ఫారెస్టు బీట్ ఆఫీసర్లు అవసరం

డొంకేశ్వర్ మండల పరిధిలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతం వేసవి కావడంతో నీళ్లు తగ్గి పచ్చికబయళ్లు ఏర్పడ్డాయి. దీంతో జింకలు, కొంగలు, పక్షులు ఆ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. అయితే, కుక్కల నుంచి వన్య ప్రాణులను కాపాడేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులతో పాటు చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు కూడా తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. కుక్కలను తరమికొడుతున్నా, అవి మళ్లీ వస్తున్నాయి. అయితే, ఫారెస్టు అధికారులు కూడా పర్యవేక్షణ చేయడానికి ఈ ప్రాంతానికి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఒక్కరే ఉన్నారు. దీంతో గోదావరి పరీవాహక ప్రాంతాన్నంతా పర్యవేక్షించి వన్య ప్రాణులను కాపాడడం సాధ్యం కావడం లేదు. ఫారెస్టు అధికారులు మరో ఇద్దరు బీట్ ఆఫీసర్లను ఏర్పాటు చేస్తే పర్యవేక్షణ చేయడం సులభంగా మారుతుంది.

> **పర్యవేక్షణ చేస్తున్నాం**
>
> 
>
> ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో కుక్కల అలజడి ఉన్న మాట వాస్తవమే. వాటిని వన్య ప్రాణులు సంచరించే చోటికి రాకుండా చర్యలు చేపడుతూనే ఉన్నాం. ప్రణాళిక ప్రకారం రోజుకో ప్రాంతాన్ని పర్యవేక్షించి జింకలు, పక్షులను సంరక్షిస్తున్నాం. వన్య ప్రాణులపై కుక్క లు దాడి చేస్తే చుట్టు పక్కల గ్రామస్తులు, రైతులు మాకు వెంటనే సమాచారం అందిస్తున్నారు.
>
> – కె సుధాకర్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి

> **మా వంతు ప్రయత్నం చేస్తున్నాం**
>
> 
>
> గోదావరిలో పచ్చిక బయళ్లు ఏర్పడడంతో వన్య ప్రాణులు వస్తున్నాయి. వాటిని రక్షించడానికి గ్రామస్తులం ప్రయత్నిస్తున్నాం. కుక్కలను ఇటువైపు రాకుండా చూస్తున్నాం. కుక్కల సంఖ్య పెరిగితే అధికారులకు సమాచారం ఇస్తాం.
>
> – ఎస్ భూమేశ్, సర్పంచ్, గాదెపల్లి

బీఆర్‌ఎస్‌తోనే బీజేపీకి పోటీ

- కాంగ్రెస్‌కు మూడో స్థానమే..
- పీఎఫ్‌ఐకి అడ్డాగా ఇందూరు
- కార్యకర్తల సమావేశంలో ఎంపీ అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నవీపేట : రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తోనే బీజేపీకి పోటీ ఉంటుందని, కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంటుందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. నవీపేటలోని రఘుపతిరెడ్డి గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు జరిగే మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సూచించారు. ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు కొన్ని మీడియా సంస్థలు కేసీఆర్ గుప్పిట్లో ఉన్నాయన్నారు. పీఎఫ్ఐ కార్యకలాపాలకు ఇందూరు అడ్డాగా మారిందని, బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో రోహింగ్యాల విస్తరణ అధికమైందని ఆరోపించారు. ఈ ప్రాంతంలో హిందువులపై దౌర్జన్యం పెరిగిపోయిందన్నారు. ఇక్కడ శివాజీ విగ్రహం పెట్టాలంటే పెద్ద సమస్య ఎదురైందన్నారు. బోధన్ నుంచే రామరాజ్యం స్థాపనకు శ్రీకారం చుట్టాలన్నారు. అన్ని వర్గాల వారికి సమాన న్యాయం చేసేందుకు ప్రధాని మోదీ వినూత్న పథకాలు చేపట్టారని పేర్కొన్నారు. జనాభా నియంత్రణకు పీఎం భవిష్యత్తులో సరైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా, దినేశ్‌కులాచారి, స్రవంతిరెడ్డి, రమణారెడ్డి, వినయ్‌కుమార్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తుంది

ఎడపల్లి : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందని ఎంపీ అర్వింద్ అన్నారు. ఎడపల్లిలో గురువారం బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు సాటాపూర్ గేట్ నుంచి భారీగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, సుధాకర్ చారి, రామరాజు, శ్రీధర్, కమలాకర్‌రెడ్డి, ఇంద్రకరణ్, సాయిలు, రాజ్యలక్ష్మి హన్మంత్, బాలరాజు, పటేల్ ప్రసాద్ పాల్గొన్నారు.



సాటాపూర్ గేట్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

క్లుప్తంగా

27న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 27న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పరమేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళా నాలుగు వివిధ కంపెనీలతో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు డిగ్రీ చదివి, 32ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు నిజామాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో 27న ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు. బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్స్ తీసుకరావాలన్నారు. వివరాలకు 8099793317, 6305743423, 9959456793 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయ జట్టుకు జిల్లా క్రీడాకారిణులు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): భారత సాఫ్ట్ బాల్ జట్టుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ తెలిపారు. మండలంలోని ధర్మారం(బి)లో గురువారం ఎంపికైన క్రీడాకారిణులను వారు అభినందించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన అండర్ –15 బాలికల భారత జట్టు ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చారు. వారిలో గుగులోత్ సౌందర్య, గోక సాత్విక, గోక శ్రావిక, సుంపాక సౌమ్యరాణి, దాసరి సరియు భారత జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్‌లోని ఆర్‌డీటీ క్రీడా మైదానంలో ఈనెల 26నుంచి జూన్ 2వరకు జరగనున్న శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జూన్ 13నుంచి 17వరకు తైవాన్ దేశంలోని తైపీలో జరగనున్న అండర్–15 ఏసియన్ ఛాంపియన్‌లో భారతజట్టు సభ్యులుగా పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సుజాత, నరేష్ పాల్గొన్నారు.

చార్‌ధామ్ యాత్రలో గుండెపోటుతో మృతి



సత్యనారాయణ (ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎన్‌సీసీ ఆఫీసర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ చార్‌ధామ్ యాత్రలో గుండెపోటుతో గురువారం మృతి చెందారు. వారం క్రితం ఆయన చార్‌ధామ్ యాత్రకు బయలుదేరారు. గురువారం కేదారీనాథ్ సమీపంలోని రాంపూర్ ప్రాంతంలో వాతావరణం అనుకూలించక శ్వాస ఇబ్బందిగా మారి గుండెపోటు రాగా అక్కడే మృతి చెందారు. ఆయన 2008 నుంచి 2013 వరకు నగరంలోని మానిక్ భవన్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయులుగా పని చేశారు. 1985 నుంచి 2011 వరకు ఎన్‌సీసీలో చీఫ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. అందరితో కలివిడిగా ఉంటూ సౌమ్యుడిగా పేరున్న ఆయన మృతి పట్ల ఎన్‌సీసీ అధికారులు, మాణిక్ భవన్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా నుంచి సుమారుగా 300 మంది యాత్రకు వెళ్లినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. నగరంలోనే 100 వరకు బ్యాచ్‌ల వారీగా వెళ్లినట్లు సమాచారం.

రెగ్యులరైజ్ చేసే వరకు పోరాడుతాం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే వరకు పోరాడుతామని, తమ నిరసన కొనసాగుతుందని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తెలిపారు. తెయూ క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనం ఎదుట గురువారం నిరసన నిర్వహించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయని అధికారులు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 20 రోజుల్లో 12 మూగ జీవాల మృతి



ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తండాలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు (ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూగ జీవాలు బలైపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం, తెగి కిందపడ్డ విద్యుత్ వైర్లను సకాలంలో సరి చేయకపోవడం వంటి తదితర కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో 20 రోజుల్లో 12 మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఇందులో ఎక్కువ భాగం పాడి గేదెలు ఉండటంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 5న నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌లో అటవీ ప్రాంతం నుంచి మేతకు వచ్చిన నెమలికి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. 6న సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పాడి రైతులు లచ్చయ్య, రాములుకు చెందిన 3 పాడి గేదెలు పొలంలో తెగిపడ్డ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందగా, అదే రోజు ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగిలి మేక మృతి చెందింది. 7న లింగంపేట మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి చెందిన గేదె మేతకు వెళ్లగా పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదే రోజున కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన విశ్వనాథ్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దనున్న వైరు తగిలి మృత్యువాత పడింది. 14న ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి తండాకు చెందిన విస్లావత్ నాయక్‌కు చెందిన ఎద్దు, ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ గ్రామంలోని గులాంకు చెందిన రెండు పాడి గేదెలు కింద పడిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. 22న ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డితండాకు చెందిన రాములు అనే పాడి రైతుకు చెందిన ఆవు, 23న ఇందల్వాయి మండలంలోని మేఘ్యానాయక్ తండాలోని పుర్యా నాయక్‌కు చెందిన గేదె విద్యుదాఘాతంలో మృతి చెందాయి. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదు.

నష్ట పరిహారం అందించాలి..

మేతకు వెళ్లిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్‌వైరు తగిలి ఎద్దు మృతి చెందింది. రూ. 60 వేలు వరకు నష్టం వాటిల్లింది. నాకు జరిగిన నష్టాన్ని ఎవరు చెల్లిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– విస్లావత్ నాయక్, తిమ్మారెడ్డితండా

కంచె ఏర్పాటు చేయాలి..

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలి. గ్రామ శివారులో ఉన్న పొలంలో తన ఆవు మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దనున్న వైరు తగిలి మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

–రాములు, తిమ్మారెడ్డితండా

రైతులే జాగ్రత్త తీసుకోవాలి

పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కొంత అప్రమత్తంగా ఉంటే నష్టాన్ని నివారించవచ్చు.

– గణేష్, విద్యుత్ డీఈ, ఎల్లారెడ్డి

నటనలో చిరంజీవే స్ఫూర్తి !

- మంచి చిత్రాలు చేయాలనేది ఆశయం
- జిల్లాకు చెందిన హీరోచీలం విరాజ్‌రెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

నిజామాబాద్ సిటీ: చిత్ర పరిశ్రమలో, నటనలో చిరంజీవే తనకు ఆదర్శం.. చిరంజీవి స్ఫూర్తితోనే సినీరంగంలోకి రావాలనుకున్నానని జిల్లాకు చెందిన సినీనటుడు, గార్డ్ మూవీ హీరో చీలం విరాజ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొనగా.. 'సాక్షి' సినీ హీరోను పలకరించింది. ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు సినీరంగంలో నిలదొక్కుకునే పాత్రలు చేస్తాను. మొదటి సినిమా చేస్తున్నప్పుడే పలు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఇప్పుడే ఒప్పుకోకుండా మొదటి సినిమా విడుదల అయ్యాక తదుపరి సినిమాలు చేసేందుకు తగు నిర్ణయం తీసుకుంటూ ముందుడగు వేస్తా.

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం?

హీరో: మాది నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం. నాన్న సంజీవ్‌రెడ్డి, అమ్మ అనసూయ, వ్యవసాయ కుటుంబం. నిజామాబాద్ సుభాష్ నగర్ రవి పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం, ఇంటర్ ఆర్‌బీవీఆర్‌ఆర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివాను. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాను.

మీ సినీ రంగ ప్రవేశం ఎలా జరిగింది?

నాకు చిన్నప్పటినుంచి సినిమాలంటే ఎంతో ఇష్టం, ముఖ్యంగా చిరంజీవి సినిమాలు చూసేవాడిని, ఆయన స్ఫూర్తితో హీరో కావాలని కలలు కనేవాడిని. ఆస్ట్రేలియాకు పైచదువుల కొరకు వెళ్లినప్పుడు అక్కడ యాక్టింగ్ స్కూల్‌లో చేరాను. యాక్టింగ్ నేర్చుకుంటుండగానే ఆడిషన్స్ ద్వారా సినిమాలో అవకాశం వచ్చింది.

మొదటి షూటింగ్ ఎక్కడ?

గార్డు సినిమా నా మొదటి సినిమా. ఇది పూర్తిగా హారర్ మూవీ. ఈ సినిమా షూటింగ్ మొత్తం ఆస్ట్రేలియాలోనే జరిగింది. మొదటిసారి కెమెరా ముందుకు వచ్చినప్పుడు పెద్దగా ఇబ్బంది పడలేదు. ఎందుకంటే యాక్టింగ్ స్కూల్ నటన నేర్చుకోవటం ద్వారా ప్రత్యేక అనుభూతి అంటూ ఏమి లేదు.

భవిష్యత్‌లో మీ లక్ష్యం ఏమిటి?

కనీసం 20 మంచి సినిమాల్లో చేయాల నేది లక్ష్యంగా పెట్టుకున్నాను. కెరీర్ బాగుండేలా మంచి పాత్రలు చేయలనేది తన అభిమతం. అనుకోకుండా ఇంత త్వరగా నాకు సినిమాలో అవకాశం వస్తుందని ఊహించలేదు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సినీ పరిశ్రమలో నిలదొక్కుకునేలా కృషి చేస్తా.

మరచిపోలేని అనుభూతి ఏమిటి?

ఇటీవల గార్డు ఫస్ట్ ప్రీమియర్ షోను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ చూసి అభినందించారు. మంచి భవిష్యత్ ఉందని, జిల్లా నుంచి చిత్ర పరిశ్రమకు లభించిన మరో హీరో అంటూ అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు, సూచనలను, ప్రయాణంలో కలిగిన ఇబ్బందులపై వాట్సాప్ నెంబర్లకు మెసేజ్ చేయగలరని తెలిపారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్,నిజామాబాద్–1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్–2	9959226017
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

- మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు
- ఘనంగా ఎన్‌టీఆర్ శతజయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వరరావు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్‌టీఆర్ అతి తక్కువ కాలంలోనే అధికారం సాధించి ప్రభంజనం సృష్టించారని, ఆయనకు భారత రత్న ప్రకటించాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం(బి) శివారులోని పీహెచ్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్ అధ్యక్షతన ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఎన్‌టీఆర్‌పై ముద్రించిన సావనీర్‌ను విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు జాతి కీర్తిని జాతీయస్థాయిలో చాటిన ఘనత ఎన్‌టీఆర్‌దేనన్నారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లోను తెలుగుదేశం మూలాలు ఉన్న నాయకులు ఉన్నారని గుర్తు చేశారు. ఎన్‌టీఆర్ అంటే ఒక వ్యక్తికాదని, ఒక శక్తి అని, తెలుగుజాతి స్ఫూర్తి అని, తెలుగు జాతి ఉన్నంతవరకు వారి గుండెల్లో శాశ్వతంగా ఉంటారని తెలిపారు. గౌరవ అతిథి మాజీమంత్రి, బీజేపీ నాయకుడు, ప్రముఖ సినీ హాస్యనటులు బాబూమోహన్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ఖ్యాతిని చాటిచెప్పిన దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ అని అన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ తెలుగు జాతి కీర్తిప్రతిష్టలు అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అనంతరం పలువురిని ఘనంగా శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఖమ్మం జిల్లా కమ్మ జనసంఘం అధ్యక్షులు ఏర్నేని రామారావు, ఎన్ఆర్ఐ రవికుమార్, డాక్టర్ గోపికృష్ణ, నాయకులు అమర్నాథ్ బాబు, మయవార్ రాజేశ్వర్, లాయర్ రాజేందర్ రెడ్డి, ఎన్‌టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నర్సాగౌడ్‌ది ఆత్మహత్యే

- బలవన్మరణానికి ప్రేరేపించిన ఐదుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సురేష్

కామారెడ్డి క్రైం: మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన రామారెడ్డి మండలం సింగరాయపల్లి సర్పంచ్ అధికం మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ (48) అనుమానాస్పద మృతి కేసును కామారెడ్డి రూరల్ పోలీసులు ఛేదించారు. మృతుడు హత్యకు గురికాలేదని, ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు గురువారం కామారెడ్డి డీఎస్పీ సురేష్ వివరాలు వెల్లడించారు. నర్సాగౌడ్ 15 సంవత్సరాల నుంచి గ్రామ రాజకీయాలలో చురుగ్గా ఉంటూ కీలకంగా మారాడు. దీంతో అతడిని ఎలాగైనా రాజకీయంగా దెబ్బకొట్టాలని గ్రామానికి చెందిన చెన్నం నర్సారెడ్డి, అధికం సత్యగౌడ్, తోట లింగంలు భావించారు. ఈక్రమంలో ఈ నెల 14న గ్రామంలో జరిగిన కమిటీ మీటింగ్‌లో నర్సాగౌడ్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడారని డీఎస్పీ తెలిపారు. అంతేకాకుండా వాట్సప్ గ్రూపులలో నర్సాగౌడ్‌ను కించపరిచే విధంగా మెసేజ్‌లు పెట్టారని వెల్లడించారు. వారికి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, శ్యామగంటి నరేష్‌లు సహకరించారని తెలిపారు. దీంతో జరిగిన అవమానాన్ని భరించలేకనే నర్సాగౌడ్ కామారెడ్డి గుమస్తా కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఈనెల 22న రాత్రి గుర్తు తెలియని విష పదార్థం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. నర్సాగౌడ్‌ను తీవ్ర మనోవేదనకు గురిచేసి అతడి ఆత్మహత్యకు కారణం అయిన ఐదుగురిపై కేసు నమోదు చేసి, గురువారం అరెస్ట్ చేశామన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎ స్సై గణేష్ గురువారం తెలిపారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన దారబోయిన శ్రీకాంత్ (26) గతంలో ఎల్లారెడ్డిలోని మీసేవా కేంద్రంలో రెండుమార్లు చోరీకి పాల్పడగా, ఇటీవల పట్టణంలోని బీసీ కాలనీలో ఓ ఇంటిలో చోరీకి యత్నించారు. దీంతో అతడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆస్తి విషయమై అన్నపై తమ్ముడి దాడి

మాచారెడ్డి: అన్నపై సొంత తమ్ముడు దాడి చేసి గాయపర్చిన ఘటన గురువారం మాచారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.... గజ్యానాయక్ తండా చౌరస్తాలో నివాసముంటున్న సర్వేశ్, కిషోర్ అనే అన్నదమ్ములు గత రాత్రి ఆస్తి విషయమై గొడవ పడ్డారు. ఆ గొడవను దృష్టిలో పెట్టుకున్న తమ్ముడు కిషోర్ చౌరస్తాలోని ఓ హోటల్లో టీ తాగుతున్న అన్న సర్వేశ్ తలపై సుత్తితో దాడి చేయగా, అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సర్వేశ్‌ను స్థానికులు ఓ ఆటోలో చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కిశోర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు.

ఎంసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎస్ఆర్ విద్యార్థులతో జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు



సాత్విక్,



స్నేహవర్మ

నిజామాబాద్‌అర్బన్: ఎంసెట్ ఫలితాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చటారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి ఉత్తమ ర్యాంకులు సాధించారు. కాకతీయ కళాశాలలోని 70 మంది విద్యార్థులు 25 వేల లోపు, 425 మంది విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. స్నేహ 1859 ర్యాంకు, సాత్విక్1942 ర్యాంకు, వైభవ్ 2246 ర్యాంకు సాధించారు. ఈసందర్బంగా గురువారం కాకతీయ కళాశాలలో ఎంసెట్ ర్యాంకర్లను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ.. మరిన్ని ర్యాంకులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం

నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన ప్రవళిక 2457ర్యాంకు, పావని 2950 ర్యాంకు, సాహితి 2991 ర్యాంకు సాధించారు. వీరితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు 2000వేలకుపైబడి ర్యాంకులు సాధించారు. దీంతో వీరిని కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.

వెక్టర్ కళాశాలకు ఉత్తమ ర్యాంకులు



నిశితరెడ్డి



శ్రీహస్నిక

నగరంలోని వెక్టర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సి.హెచ్.నిశిత రెడ్డి 1404, వినయ్ 1670 ర్యాంకులు సాధించారు. ఆర్యనగర్‌కు చెందిన శ్రీహస్నిక 2214 ర్యాంకు సాధించింది.

ధర్మారం(బి) గురుకులంలో..



జ్యోత్స్న



సింధు



సావిత్రి



శ్రీనిక



సాయిపవన



ధనలక్ష్మి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు ఎంసెట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో జోత్స్న 2348 ర్యాంకు, సింధు 3339ర్యాంకు, సావిత్రి 3552 ర్యాంకు, ఎశ్రీనిక 3826 ర్యాంకు, సాయిపవన 4398 ర్యాంకు, శ్రీహిత 6567 ర్యాంకు, సంజన 7036 ర్యాంకు, సుష్మ 9103 ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ధనలక్ష్మి 10653 ర్యాంకు, శ్రీనిక 13187 ర్యాంకు, సిరివెన్నెల 13928 ర్యాంకు, కీర్తన 16124 ర్యాంకు, చామంతి 17613 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపక బృందం అభినందించారు.

కామారెడ్డి జిల్లాలో..



ఉత్తమ ర్యాంకర్లతో సాందీపని యాజమాన్యం

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మెడిసిన్‌లో పూర్ణచందర్‌రెడ్డి 1061, సైదా సఫా అస్మా 1656, అరుణ్‌కుమార్ 6869, ఎన్. శ్రీజ 10716వ ర్యాంకును సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో అపర్ణ 2956, సిందూరి 5768, సైదా ఫాతిమా 8908, హర్షిత 10951 ర్యాంకులను సాధించారు. వీరిని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, కళాశాల యాజమాన్యం పెంటయ్య, జనార్దన్, బాలాజీరావులు ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీ ఆర్యభట్ట కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో నాగిని 3400, కీర్త 9322 ర్యాంకులను సాధించారు. కళాశాల కరస్పాండెంట్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హన్మంతరెడ్డిలు విద్యార్థులను అభినందించారు.



పూర్ణచందర్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి



అపర్ణకు స్వీట్ తినిపిస్తున్న తండ్రి



నాగిని



ప్రీతి

దోమకొండ విద్యార్థినికి 1547 ర్యాంకు



దోమకొండ: దోమకొండకు చెందిన పెద్దిరెడ్డి శతి ఎంసెట్‌లో 1547 ర్యాంకును సాధించింది. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి హనుమంత రెడ్డి సంపూర్ణల మూడో కూతురు శతి ఇంటర్ విద్యను హైదరాబాదులోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తిచేసింది. శతిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా



ప్రమాదంలో గాయపడిన జయశ్రీ

ఎల్లారెడ్డి: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డిగేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కారుకు తిమ్మారెడ్డిగేట్ వద్ద ఎల్లారెడ్డి నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న బైక్ ఎదురుగా వచ్చింది. దీంతో బైక్‌ను తప్పించబోయిన ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న జయశ్రీ, సునీత, రూప్‌సింగ్, సర్దార్‌లకు గాయాలైనట్లు వారు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు వారు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన ఒకరికి బైక్ అదుపుతప్పడంతో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లక్ష్మన్, ఆయన భార్య కవితకు పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో గురువారం మండల కేంద్రానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో లక్ష్మన్ కాలుకు గాయాలు అయ్యాయి. 108 వాహనంలో ఆయనను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనారోగ్య కారణంతో ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన సంగి సత్యనారాయణ(44) గత కొంత కాలంగా షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి జబ్బులతో బాధపడుతున్నాడు. ఇటీవల జబ్బుల తీవ్రత ఎక్కువ కావటంతో తట్టుకోలేక గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఓ తుమ్మచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్యా సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక..



వినయ్ మృతదేహం

మాక్లూర్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మండలంలోని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కృష్ణనగర్‌కు చెందిన అన్నే వినయ్(37)కు పాల వ్యాపారంలో నష్టం రావటంతో అప్పులు పెరిగి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి అతడు పురుగుల మందు తాగి, ఇంటికి చేరుకున్నాడు. నోట్లో నుంచి నురుగులు రావటం తో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు, భార్య గంగాభవాని ఉన్నారు. బార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురు కార్మికులకు గాయాలు



మాచారెడ్డి: ఇటుకల లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలోని మైసమ్మ చెరువు తండాలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన మధుకర్, అవినాష్, సంకేష్‌లు కొన్నేళ్లుగా చౌరస్తాలోని ఓ ఇటుక బట్టీలో పని చేస్తున్నారు. వీరు ట్రాక్టర్‌లో ఇటుకను లోడ్ చేసుకొని మైసమ్మ చెరువు తండాకు వెళ్తుండగా మైసమ్మ చెరువు తండా రాజఖాన్‌పేట మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.